

# ఏ ఫ్రెండ్ ఇన్ నీడ్.....

## ఎమ్. దివాకర్ బాబు

మీటివొదిలిన తీగెనుండి వినబడే శబ్దం గుర్తుకు వచ్చేలా 'హుమ్....' అంటూ మూలిగింది పంకజం... ఆ మూలుగులో గమకానికి వొయ్యారానికి నావాంఛ అధికమైంది... చేతిని వాటంగా అమిరిపోయే గుండెల మీద నుండి క్రిందికి జార్చాను....

నా చేతిని తొలిగించి తన పెదవుల్తో నా పెదవుల్ని వొత్తుతోంది...

పాదరసంలా పాకే నరాలూ, మెంథాల్ కోటింగ్ కొట్టినట్లు అణువణువూ.... ఆ వొరవడి మరింత ఒరిపిడిని కోరుతోంది.

వాక్యూమ్ చేయబడిన రెండు అర్థగోళాలు ఏ శక్తీ విడదీయలేనంత బలంగా కలసి పోయినట్లు ఆరాటంగా ఇద్దరం....

పంకజం కదలికల్లో నయాగరా జలపాతం లాంటి వుధృతం ఒకసారి... చందన శీతల పవనం మందగమనంతో సోకినట్లు మరోసారి.... పెళ్ళయి నాలుగేళ్ళు కావొస్తున్నా పంకజం నాకు 'అలవాటు' కాలేదు... ప్రతి రాత్రీ కొత్తే...

గట్టుతెగిన ప్రవాహంలా నేను!

ఉరుకులూ, పరుగులతో వచ్చే నదీప్రవాహాన్ని తనలో కలిపేసుకోవడం కోసం కెరటాల కేరింతలు కొట్టే సాగరంలా తాను!

కాలింగ్ బెల్ మ్రోగింది...

చటుక్కున పంకజాన్ని వొదిలాను.

'ఉస్సు'రని నిట్టూర్చింది పంకజం... మళ్ళీ పంకజం మీదికి వొరగబోయాను...

కాలింగ్ బెల్ మ్రోగుతూనే వుంది....

న్యూసెన్స్... తప్పదు. లేచాను...

"ఎవరూ.... వస్తున్నా..." అని అరిచి పంకజం కూడా డ్రెస్ చేసుకున్నాక వెళ్ళి తలుపు తీసాను.

సుబ్బారావు!

వేళ కాని వేళ వచ్చిన వాడి రాకకన్నా వాడి వాలకం నాకు విస్మయాన్ని కలిగించింది. కాఫీ, టీ, సిగరెట్ కాదు కదా కనీసం వక్కపొడి అయినా వేసుకోని సుబ్బారావు బాగా తాగి వున్నాడు... గుప్పున వాసన కొడ్తోంది...

"రారా" అన్నాను....


"నువ్వే బైటికి రా... నీతో చాలా అర్జంటుగా మాట్లాడాలి..." వాడి మాటల్లో నాతో ఏదో చెప్పుకోవాలన్న తపన కొట్టొచ్చినట్లు ధ్వనిస్తోంది. మర్యాదకోసం వాడ్ని లోపలికి రమ్మన్నానేగానీ వాడ్ని వీలైనంత త్వరగా ఇక్కడ్నించి తీసుకు పోవాలన్నదే నా వుద్దేశ్యం కూడా?

పంకజానికి తాగుడంటే అసహ్యం....

నాకు పెళ్ళికాక ముందునుంచీ సుబ్బారావూ నేనూ స్నేహితులం. వాడికీ, నాకూ పెళ్ళిళ్ళయ్యాక ఫామిలీ ఫ్రెండ్స్ అయ్యాం. సుబ్బారావు అన్నా, వాడి భార్య సుశీలన్నా పంకజానికి చాలా మంచి అభిప్రాయం. అప్పుడప్పుడు నలుగురం కలిసి పిక్నిక్‌లకి, సినిమాలకీ వెళుతుంటాం... విపరీతంగా సిగరెట్లు కాల్చే నన్ను సుబ్బారావుతో పోల్చి అప్పుడప్పుడూ ముద్దుగా తిడుతూ వుంటుంది పంకజం!

అతని పేరు తెల్సుకానీ చెప్పను. 'పిచ్చాడు' అనేవాళ్ళు అందరూ... మా వీధిలో తిరుగుతూండేవాడు. ఎప్పుడూ ఇంగ్లీషులో మాట్లాడుతూ వుండేవాడు. గొణుక్కునేవాడు. ఆకలి, నిద్ర తెలియని వాడిలా తిరిగేవాడు.. శుష్క శరీరం.. శూన్య హృదయం.... మనుష్యుల్ని తీక్షణంగా చూసేవాడు... ఎం.ఏ ఫస్ట్ క్లాస్‌లో పాసయినా అతను అలా పిచ్చివాడై పోవడానికి కారణం?

అతని గురించి విన్న కథే ఈ కథ వెనుక కథ!



హఠాత్తుగా అతను కన్పించకపోడం ఏదో వెలితిగా ఫీలయ్యాను... అతను దిక్కులేక హీనాతి హీనంగా మరణించాడన్నవార్త 'మూడ్' పాడుచేసింది. అలా పాడైపోయిన మూడ్ ఈ కథ వ్రాయడానికి 'మూడ్' అయింది.

పరిచయం అయిన ప్రతివ్యక్తీ స్నేహితుడు కాడని, స్నేహితుడిగా నమ్మకూడదని తెలియజేయడం కోసం ఈ కథ వ్రాసాను!

—ఎమ్. దివాకర్ బాబు

అలాంటి సుబ్బారావుని ఇలాంటి స్థితిలో చూస్తే ఇంకేమైనా వుందా? మా ఫ్రెండ్‌షిప్‌తో పాటు ఫామిలీ ఫ్రెండ్‌షిప్‌కి కూడా ఫుల్‌స్టాప్ పెట్టేయాల్సి వస్తుంది. పంకజం వుద్రేకి!

ఎంతగానో ఒకళ్ళని ఒకళ్ళు అర్థం చేసుకుంటేనే గానీ ఫామిలీ ఫ్రెండ్స్ కాలేము.... అలా అర్థం కాగల మనుష్యులూ అరుదే..

సుబ్బారావుని బైట నిలబడమని చెప్పి పంకజానికి నచ్చజెప్పి బైటపడ్డాను....

* * *

"నో" అరిచాను...

"తాగిమాట్లాడుతున్నావ్ రాస్కెల్" అని తిట్టాను.

సుబ్బారావు నిశ్శబ్దంగా నవ్వాడు...

"ఒరే వెంకట్రావూ.... ఇంత సిగ్గులేని తనాన్ని తెచ్చుకోవడం కోసం తాగాను... అంతేకానీ తాగిమాట్లాడటం లేదు— నా కళ్ళారా చూసాను.... నాకళ్ళు కూడా నన్ను మోసం చేసాయంటావా?"

విద్యుత్ కమ్చీతో దెబ్బలు తిన్నదానిలా విలవిల్లాడి పోయింది మనస్సు. ఏమిటిది? నిజమా?

"ఐవాంట్ సమ్ డ్రింక్"

ఒక పెగ్ గొంతులోకి జారిన తర్వాత వాడెందుకు తాగాడో అర్ధమవుతోంది...

పెగ్గు వెంట పెగ్గు...

'సిగ్గు.... సిగ్గు....' గొణుక్కున్నాను...



ఆకుల మధ్య ఫిల్టరు వెయ్యబడిన వెన్నెల తువకలు రెక్కలు విరిగిన వెలుతురు పిట్టల్లా నేలమీద దొర్లుతున్నాయి.

సుబ్బారావు వంక జాలిగా చూసాను...

వాడి చూపులు నేలమీద వేగంగా కదులుతున్నాయి.

వాడి ఆలోచన్లు విషాచేరలేనంత అగాధాల్లో వుండి వుండాలి.

"ఏం చెయ్యాలనుకుంటున్నావ్?" డస్ట్‌బిన్‌లో స్మెల్ లాంటి నా ప్రశ్న నాకే కంపుకొడ్తోంది.

తోక తొక్కబడిన త్రాచులా తలెత్తాడు వాడు.

పళ్ళు పటపట కొరికాడు.

"వాడ్ని దాన్ని విలువునా చీరేస్తాను... ముక్కలు ముక్కలుగా కోసి కారంలో పొర్లించి, చూనెలో వేయించి...." జుట్టు పీక్కున్నాడు...

రాగాలొలుకుతూ హఠాత్తుగా తెగిన తీగెలా "ఆ...." అంటూ ఆక్రందన చేసాడు చివర్న!

నాకు గుండె బరువెక్కుతోంది!

ఎవభైకేజీల శరీరం కొన్ని వందల టన్నుల గుండెని మోయగలదనడానికి నా శరీరమే సాక్ష్యం!

"నో... వద్దు...." వాడిప్పటికిప్పుడే అన్నంతపనీ చేస్తాడేమో అన్నంత భయంతో వారించాను.

క్షణకాలం చీకట్లని చూపులతో చీల్చుతూ నా కళ్ళలోకి చూసాడు.

"దెన్... ఆత్మహత్య చేసుకోవాలి!"

ఆల్టర్నేటివ్ అదొక్కటే నన్నంత దృఢంగా అన్నాడు.

అవునుమరి!

కపి— కాకపోతే ఓటమి!!!

ఏదో ఒకటి తప్పదు....

ఆ రెంటిలో ఏది చేసినా నా సుబ్బారావు నాకు వుండడింక... సెంట్రల్ జైల్లోనో, సే క్రెడ్ హెవెన్‌లోనో....

నో... అట్లాజరక్కూడదు... నివారించాలి.... వాడికి ధైర్యం చెప్పాలి.... ఎట్ ఎనీ కాస్ట్ వాడ్ని కాపాడుకోవాలి... స్నేహితుడిగా అది నా కర్తవ్యం! మనిషిగా నా ధర్మం!!!

అయిదు నిమిషాల ఆల్కహాలు సేవనానంతరం....

"సుబ్బా... నీ మీద నీకు నమ్మకం వుందా?" అడిగాను.

వాడు మెడఎత్తకుండా తలమాత్రం ఎత్తి నావంక చూసిన తీరే ప్రశ్నార్థకం మార్కులా వుంది...

"ఐమీన్... నీ పురుషత్వం మీద" విశదపరిచాను.

"అరగంట తర్వాత ఎలాటి ఆడదాని చేతనైనా దండం పెట్టించుకోగలన్నేను...." వాడిమాటలు తడబడుతున్నాయి.

భుజం తట్టాను, "అంటే అర్థమవుతోంది కదూ... నీ భార్య నీతో సుఖం లేకకాదు మరెవరితోనో సంబంధం పెట్టుకున్నది.... అది ఆమె తత్వం... తిరుగుబోతు లక్షణం. అలాంటి దాన్ని చంపేసో, నువ్వు చచ్చో సాధించేదేముంది? కనుక ఆమెని చీవించి తొలగిపొమ్మను. పోనంటే విడాకులు తీసుకో ఆమె నడతని నిరూపించి. ఆ తర్వాత చేసుకోవాలనుకుంటే లక్షణమైన పిల్లని చూసి పెళ్ళిచేసుకో... పెళ్ళి ఎలర్జీ అని భావిస్తే దేన్నయినా వుంచుకో... అంతేకాని చస్తావ్రటా ఇడియట్. చావకు!"

"నీకేంరా మగాడివి? ఆ సుశీలే... పేరు మాడుమళ్ళీ సుశీలట సుశీల... తగులుకున్నవాడు మోజు తీరాకతన్ని తగలేసి పోతే వాడకట్టు చేరుతుంది... పుచ్చిపోతుంది... రొచ్చుగుంట అవుతుంది. ఆమెని చూసి నవ్వేథాన్సు నీదవుతుందప్పుడు. నువ్వాసరికి మంచిభార్యతో, పిల్లాజెల్లాతో కులాసాగా వుంటావ్... ఫాలో అవుతున్నావా?...."

అవేమాటల్ని అటూ ఇటూ మార్చి క్రిందామీదాచేసి— వెనక్కి ముందుకీ తిప్పి పదేపదే చెప్పాను.

దాదాపు

రెండుగంటల్నీ

రెండు బాటిల్స్‌నీ

ఖర్చుచేసేటప్పటికి వాడు దార్లోకి వచ్చాడు.

"అంతేనంటావా?" అన్నాడు.

జాలి... నరాలు చిల్లులు పడిపోతున్నంతటి బాధ. వాడ్ని గుండెల కదుముకుని, 'అదికాదురా సన్నాసీ... వాడ్ని దాన్ని కపితీరేట్లు నరకరా... కోపం చల్లార్చుకోరా...' అని అనాలని వుంది.

అనకూడదు!

నేను మనిషిని! మంచి చెడ్డల్ని తర్కించుకుని సభ్య సమాజపు పరిహద్దులు దాటకుండా గౌరవాన్ని కాపాడుకుంటున్న బుద్ధిజీవిని!

'అంతే' అన్నాను.

వాడ్ని ఇంటి దగ్గర డ్రాప్ చేసాను.

వొదల బుద్ధికాలేదు.

మళ్ళీ మళ్ళీవాడి చేత 'అఘాయిత్యాలు చెయ్యన'ని ప్రమాణం చేయించుకున్నాను...

నేనుకదలబోతుంటే నన్ను వాటేసుకుని వలవలా ఏడ్చేసాడు... నాకూ దుఃఖం వచ్చింది కంట్రోల్ చేసుకున్నాను.

పూర్ చాప్...

భుజం తట్టి, కన్నీరుతుడిచి రేపు మార్నింగ్ వస్తాను లాయరు దగ్గరికి వెళ్దాం సిద్ధంగా వుండమని చెప్పి ఇంటి దారిపట్టాను.

పంకజం నాకోసం కాచుకునుంది.

పంకజం కళ్ళల్లో ఎర్రటి జీరలు నిద్రని ఆపుకోవడం వల్ల వచ్చినవి కావని నాకుతెల్సు!

కానీ నాకు మూడ్‌లేదు.

నా వాసన పసిగట్టి నన్ను తిట్టకముందే పంకజానికి సుబ్బారావు క్షోభ అంతా చెప్పాను... పిచ్చివెధవ ఎట్లా తట్టుకున్నాడో ఆ బాధా పర్వతపు తాకిడిని!

అలా చెప్తూనే నిద్రలోకి జారాను...

* * *

ఎక్కువ మోతాదులో తాగానేమో బాగా నిద్రపట్టింది. మెలుకువ వస్తూనే నాపీవంక చూసాను. తొమిదిన్నర!

గుడ్‌గాడ్! అరగంటలో ఆఫీసులో వుండాలి.

'పంకజం... కాఫీ' అనికేకపెట్టి అలవాటు ప్రకారం సిగరెట్ పెట్టెకి అందుకోబోయాను...

సిగరెట్ పాకెట్ కింద ఓ కాయితం నా దృష్టిని ఆకర్షించింది. ఏమిటా అని తీసుకున్నాను. దానిమీద హాండ్‌రైటింగ్ వెంటనే గుర్తుపట్టాను. సుబ్బారావుది. ప్రొద్దుటే కలుస్తానన్నాను కదా... ఇంతలోపల వుత్తరం వ్రాయాల్సినంత అవసరం ఏమొచ్చింది, కొంపదీసి... గుండెఝల్లుమంది— వణుకుతున్నచేతుల్తో, చెదిరిపోతున్న దృష్టితో వుత్తరాన్ని చదివాను.

'డియర్ వెంట్రావ్...

గతరాత్రి నీకు చెప్పిన కథలో సుబ్బారావుని నువ్వే!

నేనూ, పంకజం వెళ్ళిపోతున్నాం. నువ్వు మమ్మల్ని చంపడంగానీ, నిన్ను నువ్వు చంపుకోవడంగానీ చెయ్యవన్న భరోసాతో....

...సుబ్బారావు

నేనేమైపోతున్నానో నాకు తెలియడం లేదు.

నేనేం చెయ్యాలిప్పుడు? *



### బుద్ధి

"ఆ కలెక్టర్‌గారి అబ్బాయిని చూసి బుద్ధి తెచ్చుకో... ఆ కుర్రాడికి అన్నీ ఫస్ట్ మార్కులేవ స్తాయి" కోపంగా అన్నాడు గుమాస్తా గుర్నాధం కొడుకుతో.

"నా సంగతి అలా వుంచి వాళ్ళ నాన్నని చూసి నువ్వు బుద్ధి తెచ్చుకో. అతను కలెక్టర్ నువ్వు గుమాస్తా." వెంటనే అన్నాడు కొడుకు.

—జి.శివరామప్రసాద్
(గుంటూరు)

